# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే


ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

**విలేకర్లు కావలెను**


తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ
ఆర్.సి. ఇంచార్జ్‌లు, మండలాల వారిగా
విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు
**99086 89674** లో
సంప్రదించగలరు



హైదరాబాద్ | శుక్రవారం,మే9,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1





## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, సైన్యానికి
# సంఘీభావంగా ర్యాలీ...

- సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ
- వీర జవాన్లకు 140 కోట్ల మంది భారతీయులు అండగా ఉంటారన్న సీఎం
- 'ఆపరేషన్ సిందూర్' వారికి సమాధానం: హైదరాబాద్ ర్యాలీలో రేవంత్ రెడ్డి
- భారత దేశ సార్వభౌమత్వంపై ఎవరైనా దాడి చేస్తే ఊరుకునేది లేదు
- భారత భూభాగంలో కాలు మోపి, తమ ఆడబిడ్డల నుదుటి సిందూరాన్ని తుడిచి వేయాలనుకుంటే 'ఆపరేషన్ సిందూర్' ఇందుకు సమాధానం

హైదరాబాద్,మే9, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి నగరంలోని యువత పెద్ద ఎత్తున తరలి వచ్చింది. సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారత దేశ సార్వభౌమత్వంపై ఎవరైనా దాడి చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. తమ శాంత స్వభావాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు.భారత భూభాగంలో కాలు మోపి, తమ ఆడబిడ్డల నుదుటి సిందూరాన్ని తుడిచి వేయాలనుకుంటే 'ఆపరేషన్ సిందూర్' ఇందుకు సమాధానం అని అన్నారు. ఆపరేషన్ సిందూర్ వంటి వాటి ద్వారా మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి భారత వీర జవాన్లకు ఉందని అన్నారు. ఆ వీర జవాన్లకు 140 కోట్ల మంది భారతీయులు అండగా ఉంటారని అన్నారు.భారత్ వైపు కన్నెత్తి చూస్తే మీకు నూకలు చెల్లినట్లేనని హెచ్చరించారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి మహాత్మా గాంధీ అమరులయ్యారని, ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నామని అన్నారు.



## జమ్మూపై పాక్ డ్రోన్లు,
# క్షిపణుల దాడి యత్నం

- పాక్ దాడులను అప్పటికప్పుడే తిప్పికొట్టాం: భారత రక్షణ శాఖ ప్రకటన
- భారత భద్రతా దళాలు తక్షణమే ప్రతిస్పందించి దాడులను నిర్వీర్యం చేసిన వైనం
- ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రక్షణ శాఖ

మే9, జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న కీలక సైనిక స్థావరాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసేందుకు యత్నించగా, భారత భద్రతా దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని భారత రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించలేదని స్పష్టం చేసింది.

## సరిహద్దుల్లో హై టెన్షన్...



### ఐపీఎల్ మ్యాచ్ మధ్యలోనే నిలిపివేత

భారత్, పాకిస్థాన్ మధ్య దాడులు, ప్రతిదాడుల పర్వం తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. ఇవాళ భారత్... పాకిస్థాన్ నగరాలపై నిప్పులు చెరిగిన నేపథ్యంలో, పాకిస్థాన్ జమ్మూ, రాజస్థాన్ ప్రాంతాలపై దాడులకు తెగబడింది. పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. కాగా, సరిహద్దుల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొనడంతో... ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్ ను మధ్యలోనే నిలిపివేశారు. ఐపీఎల్ మ్యాచ్ అర్థంతరంగా రద్దు కావడం ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులకు అద్దం పడుతోందిమ్యాచ్ ను అధికారులు నిలిపివేసే సమయానికి పంజాబ్ కింగ్స్ 10.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది.

# నూతన పోప్‌గా కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్...

- అమెరికాకు చెందిన కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్ నూతన పోప్‌గా ఎన్నిక
- లియో-14 పేరుతో బాధ్యతలు చేపట్టనున్న 267వ పోప్
- చరిత్రలో తొలిసారి అమెరికా వ్యక్తికి పోప్ పీఠం

మే9, ప్రపంచ క్యాథలిక్ క్రైస్తవుల మత గురువుగా, నూతన పోప్ గా అమెరికాకు చెందిన కార్డినల్ రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రీవోస్ట్ ఎన్నికయ్యారు. ఆయన లియో–14 పేరుతో బాధ్యతలు స్వీకరించనున్నారు. సిస్టీన్ చాపెల్ పైనుంచి తెల్లటి పొగ వెలువడటంతో, కాన్‌క్లేవ్ రెండో రోజే నూతన పోప్ ఎన్నిక పూర్తయినట్లు సంకేతాలు వెలువడ్డాయి. 69 ఏళ్ల ప్రీవోస్ట్,



చరిత్రలో పోప్‌గా ఎన్నికైన తొలి అమెరికన్ కావడం విశేషం.చికాగో, ఇల్లినాయిస్‌కు చెందిన ప్రీవోస్ట్, ప్రపంచవ్యాప్త అనుభవమున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.



## ఆపరేషన్ సిందూర్
# అద్భుతం

- ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు సైన్యం గుణపాఠమన్న మంత్రి
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై విజయవంతమైన దాడులు
- మాజీ సైనికుడిగా భారత బలగాలకు ఉత్తమ్ అభినందనలు

పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పాయని ఆయన అన్నారు. మాజీ సైనికుడిగా, భారత సైన్యం ప్రదర్శించిన పరాక్రమానికి అభినందనలు తెలియజేస్తున్నట్టు వెల్లడించారు.జమ్ముకశ్మీర్‌లో ఇటీవల భారతీయ పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రమూకలు జరిపిన దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర కలకలం రేపింది.

## ప్రభుత్వ, ప్రజా ఆస్తుల
# పరిరక్షణే 'హైడ్రా' ఉద్దేశం

- సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో 'హైడ్రా' పోలీస్ స్టేషన్ ప్రారంభం
- ఇతర మెట్రో నగరాల సమస్యలు హైదరాబాద్‌కు రాకుండా చూడటమే లక్ష్యమన్న రేవంత్
- చెరువులు, నాలాల ఆక్రమణల నియంత్రణకు 'హైడ్రా' ఏర్పాటు



హైదరాబాద్,మే9,( హైదరాబాద్ నగరం దేశంలోని ఇతర మహానగరాలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల బారిన పడకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ దిశగా పటిష్ట చర్యలు చేపట్టేందుకే 'హైడ్రా'ను ఏర్పాటు చేశామన్నారు. సికింద్రాబాద్‌లోని బుద్ధభవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బెంగళూరులో తాగునీటి ఎద్దడి, ముంబై, చెన్నై నగరాల్లో వరద బీభత్సం, ఢిల్లీలో వాయు కాలుష్యం వంటి పరిస్థితులు చూస్తున్నామని, అలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూడటానికే ఎన్ని విమర్శలు ఎదురైనా ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామని తేల్చి చెప్పారు.మన పూర్వీకులు అందించిన చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. చెరువులు కనుమరుగైతే మానవ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. 450 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరాన్ని పరిరక్షించడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

- ఆపరేషన్ సిందూర్" పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు
- తొమ్మిది ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం, పలువురు ఉగ్రవాదులు హతం
- అమాయకులకు హాని కలగకుండా, తక్కువ నష్టంతో ఆపరేషన్ పూర్తి

## ఆపరేషన్ కచ్చితత్వం
# ఊహాకందనిది




న్యూఢిల్లీ,మే9,( భారత రక్షణ దళాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్ నిర్వహించిన తీరు, దాని కచ్చితత్వం ఊహాకందనిదని, ఇది అత్యంత ప్రశంసనీయమైన విజయమని ఆయన కొనియాడారు. మన సైన్యం చూపిన ధైర్యసాహసాలకు వారిని అభినందిస్తున్నానని ఆయన అన్నారు.'ఆపరేషన్ సిందూర్' గురించి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "ఆపరేషన్ సిందూర్ అత్యంత కచ్చితత్వంతో నిర్వహించబడింది, ఇది ఊహకు కూడా అందని విషయం, చాలా ప్రశంసించదగినది" అని పేర్కొన్నారు.

## తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో
# మావోయిస్టుల దాడి

- కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు పోలీసులు అక్కడికక్కడే మృతి
- నిఘా సమాచారంతో గాలింపు చేపడుతుండగా ఘటన


- కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు పోలీసులు అక్కడికక్కడే మృతి
నిఘా సమాచారంతో గాలింపు చేపడుతుండగా ఘటన


తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం మరోసారి నెత్తురోడింది. మావోయిస్టులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలిన ఘటనలో ముగ్గురు పోలీసులు దుర్మరణం పాలయ్యారు. ములుగు జిల్లా వాజేడు పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ ఉదయం ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో సరిహద్దు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల పక్కా సమాచారంతో భద్రతా దళాలు తెల్లవారుజాము నుంచే కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి.



# ఎస్వీఎస్ హాస్పిటల్‌తో..
# కోదాడలో కార్పోరేట్ స్థాయి వైద్యసేవలు..

- సివిల్ సప్లయ్,ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయం
- వైద్యశాలలు వ్యాపార దృక్పథంతో కాక సేవా దృక్పథంతో వ్యవహరించాలి
- పేదలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం అందించాలి
- మెరుగైన వైద్య సేవలు అందించి ఎస్వీఎస్ వైద్యశాల పేరు తెచ్చుకోవాలి
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



కోదాడ,ప్రజా ముచ్చట: నగరాలకే పరిమితమైన కార్పొరేట్ స్థాయి వైద్యం కోదాడ కు అందుబాటులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో ఫ్లై ఓవర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోదాడ హుజూర్నగర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు పూర్తి వ్యాపార దృక్పథంతో కాకుండా వైద్యులు సేవా దృక్పథంతో పేద మధ్యతరగతి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజలకు విద్య వైద్యం అత్యంత ఆవశ్యకమని కోదాడలో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ప్రశంసనీయమన్నారు. అభివృద్ధికి చెందిన అంశాలపై తన వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. వైద్యశాలలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను నిర్వాహకులు డాక్టర్ శివప్రసాద్ రావూరు మంత్రికి వివరించారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్ రావూరు మాట్లాడుతూ వైద్యశాలలో హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా గుండె ఊపిరితిత్తులు మెదడు నరాలు మూత్రపిండా వ్యాధులు క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు ప్రతి విభాగానికి అనుభావజ్ఞులైన వైద్యులు వైద్య పరికరాలు వ్యాధి పరిశోధక యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వైద్యశాల అన్నివేళలా అందుబాటులో ఉంటుందన్నారు అనంతరం వైద్యశాల యాజమాన్యం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ రావూరు శివప్రసాద్, ఎస్ వి ఎస్ హాస్పిటల్ వైద్యుల బృందం, కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు కోదాడ హుజూర్నగర్ ఐఎంఏ వైద్యులు కోదాడ హుజూర్నగర్ పట్టణాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు



# చదువుల తల్లి ఐల మౌనిక కు సన్మానం



హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:హుజూర్ నగర్ పట్టణంలోని 10 వ వార్డ్ కి చెందిన ఐల నాగరాజు - నిర్మల దంపతుల కూతురు ఐల మౌనిక గర్ల్స్ హై స్కూల్ లో చదువుతూ 10 వ తరగతి లో 571 /600 మార్కులతో 10/10 గ్రేడ్ సాధించడం పట్ల మాజీ వార్డ్ మెంబర్ దుగ్గి అన్నపూర్ణ, ఐద్వా మహిళ సంఘం సభ్యురాలు దుగ్గి నాగమణి ల అధ్వర్యంలో మౌనికను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, రేపాకుల మురలీ దుగ్గివేణు ఇందిరాల శ్రీనివాస్ దుగ్గి సాయిబాబ వడ్లానపు గురవయ్య సుదర్శిని మింటు కార్తీక్ మహేంద్రర్ లు పాల్గొన్నారు

# భారత సైన్యానికి మద్దతుగా ధర్మశాలలో బీసీసీఐ ప్రత్యేక కార్యక్రమం

- సైనిక పరాక్రమానికి బీసీసీఐ సంఘీభావ కార్యక్రమం
- ధర్మశాల మ్యాచ్‌కు ముందు బి ప్రాక్ దేశభక్తి గీతాలాపన
- సైనికుల ధైర్యసాహసాలకు క్రికెట్ ప్రపంచం వందనం

భారత సైన్యం ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ప్రదర్శించిన అసామాన్య ధైర్యసాహసాల, ఉగ్రవాద నిర్మూలనలో సాధించిన విజయానికి ప్రశంసగా, బీసీసీఐ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా తన సంఘీభావాన్ని ప్రకటించింది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత సైనిక దళాలు 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో, భారత సైనికుల నిరుపమాన సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగనిరతిని గౌరవిస్తూ, నేడు ధర్మశాల క్రికెట్ స్టేడియం ఓ ప్రత్యేక కార్యక్రమానికి వేదిక కానుంది. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్ ఆరంభానికి ముందు, బీసీసీఐ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు బి ప్రాక్ (ప్రతీక్ బచన్) పాల్గొని, భారత సైనికుల గౌరవార్థం దేశభక్తి గీతాలను ఆలపించి, వారి సేవలను కొనియాడనున్నారు. భారత సైన్యానికి మద్దతుగా బీసీసీఐ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఇదే మొదటిసారి కాదు. మే 7న కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ముందు కూడా ఇరు జట్ల క్రీడాకారులు, సహాయక సిబ్బంది భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు.

# రాయి చెరువు నీటి అక్రమ తరలింపు పై చర్యలు తీసుకోవాలి

- తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన రైతులు

పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట,మే 08: మండల పరిధి మాచారం గ్రామంలోని రాయి చెరువు చుట్టుపక్కల గ్రామాలకు జీవనాధారంగా గత కొన్ని సంవత్సరాలుగా కొన సాగుతుంది. కాగా కొందరు ధనిక రైతులు వారికున్న పలుకుబడితో రాయి చెరువులో నిల్వ ఉన్న నీటిని అక్రమంగా మోటార్లను ఏర్పాటు చేసి కాలువలు తవ్వి పైపులైన్ల ద్వారా తమ వ్యవసాయ క్షేత్రాలకు, బావులకు అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి చెరువు కింద ఉన్న వందల ఎకరాల ఆయకట్టు బీడు భూములుగా మారటం తో పాటు గ్రామాల్లోని ప్రజలకు కనీసం త్రాగునీరు కూడా దొరకదేమోనని గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు కావాలని ఈ చెరువు నీటిని అక్రమంగా తరలించి చెరువు శిఖాన్ని భూ కబ్జాకు గురి చేసే ఆలోచనలో ఉన్నట్లు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఈ అక్రమ నీటి తరలింపును అధికారులు పట్టించుకొని నిలిపివేయకపోతే భూగర్భ జలాలు ఎండిపోయి కరువు కాటకాలు సంభవించే పరిస్థితి అవకాశం ఉందని కావున వెంటనే ఈ ఆక్రమదారులపై చర్యలు తీసుకొని అక్రమ మోటార్లను, పైపులైన్, కాలవలను తొలగించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు గురువారం తహసిల్దార్ లాలు నాయక్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ రాయి చెరువు ఆయకట్టు కింద ఉన్న గ్రామాలు మాచారం, ఎస్సీ కాలనీ, అనిరెడ్డిగూడెం, పెన్ పహాడ్, నూర్జహాన్ పేట, రైతుల వ్యవసాయ భూములు, ప్రజలకు, పశుపక్షాదులకు ఈ చెరువులో నీరు ఉంటేనే జీవనం గడుస్తుందని అక్రమ నీటి తరలింపుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు



చేపడతామని రైతులు అధికారులను హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పలు గ్రామాలకు జీవనాధారమైన రాయి చెరువు నీటిని కాపాడేందుకు అధికారులకు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు. తాహసిల్దారుకు వినతి పత్రం అందించిన రైతులు తూముల ఇంద్రసేనారావు, చింత రెడ్డి సుధాకర్ రెడ్డి, కందిమల్ల మధుసూదన్ రెడ్డి, చింత రెడ్డి ప్రభాకర్ రెడ్డి, రంగినేని లక్ష్మీకాంతారావు, మందుల రమేష్, రంగినేని శ్రీకాంత్, రంగినేని దామోదర్, రంగినేని వివేక్, తదితరులు ఉన్నారు...

# యంగ్ ఇండియా శిక్షణ శిబిరం ప్రారంభం



పాలకవీడుప్రజాముచ్చట: పాలకవీడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుండి తొమ్మిదవ తరగతి కొరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమాన్ని గురువారం మండల విద్యాధికారి కాటయ్య ఇంజమూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలో ఉన్న వివిధ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ డాన్స్ ఇంగ్లీష్ గ్రామర్, యోగా మొదలగు అంశాలలో ఈనెల 23వ తారీకు వరకు ఉచితంగా శిక్షణ జరుగుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేష్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం సునీత గ్రామ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఆటల అనంతరం విద్యార్థులకు అరటి పళ్ళను అందజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు వివిధ విభాగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు విద్యార్థులు వాలీబాల్ చెస్ క్యారమ్స్ షటిల్ వంటి ఆటలను శిక్షణ ద్వారామెరుగుపరచుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం అనంతరంమండల విద్యాధికారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నరేష్ రెహమతున్నీసా, విద్యార్థిని విద్యార్థులతో కలిసి పాలకవీడు మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రైవేట్ పాఠశాలల కంటే తమ పాఠశాలలో మెరుగైన బోధన లభిస్తుందని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయ బృందం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉన్నారని విద్యార్థులను ప్రభుత్వ బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు

# ఆపరేషన్ సిందూర్‌కు సెల్యూట్

- శత్రుసేనలపై భారత సైన్యం వీరోచిత పోరాటం
- త్రివిధ దళాల ధైర్యసాహసాలతో భారత్ గర్విస్తుంది
- పాకిస్తాన్ కు ఇదే సరైన గుణపాటం
- వైమానిక దళంలో పని చేసిన అనుభవం నాది
- యుద్ధ విమానాలలో పైలట్ గా విధులు నిర్వర్తించా
- మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



కోదాడ, మే 08 ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైన్యం చేస్తున్న పోరాటం అనన్యాసమాన్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వం దేశ ప్రజల లక్ష్యసాధన కోసం త్రివిధ దళాలు పాకిస్తాన్ లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో శత్రుసేనలకు చెందిన తొమ్మిది స్థావరాలపై చేసిన దాడులు విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మద్యాహ్నం కోదాడలో ఓ ప్రవైట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియా తో మాట్లాడారు. ప్రేరేపిత తీవ్రవాదాన్ని తుదముట్టించే ప్రక్రియలో త్రివిధ దళాలు చూపిన డైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తుందని ఆయన కొనియాడారు భారత వైమానికదళంలో పనిచేసిన అనుభవం తనకుందని అందులో యుద్ధ విమానాల పైలట్ గా యుద్ధ సమయంలో పని చేసిన అనుభవాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ అనుభవంతో చెబుతున్నా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్గవాదాన్ని అణిచివేసేందుకు గాను త్రివిధ దళాలు సమర్ధవంతంగా ఎంతో చాక చక్యంగా శత్రు శిబిరాలపై దాడులు జరిపి పాకిస్థాన్ కు సరైన గుణపాఠం నేర్పారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డివ్యాఖ్యానించారు.

# ఫాసిజంపై సాధించిన విజయం...

మే 9వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఫాసింజపై సాధించిన విజయం ఎనభయ్యవ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు. 1945వ సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున సోషలిస్టు రష్యాకు చెందిన రెడార్మీ హిట్లర్ ఫాసిస్టు మూకలను నిర్ణయాత్మకంగా ఓడించి బెర్లిన్‌లోని రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్ భవనం)పై ఎర్రజెండాను ఎగురవేశాయి. జాత్యహంకారంతో యావత్ ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని మొదలుపెట్టిన యుద్ధంలో అనివార్యంగా ఓటమిని చవిచూడనున్నానని ముందుగానే గ్రహించిన నాజీ హిట్లర్ ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో ఫాసిజంపై సాధించిన విజయానికి అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. 1920వ దశకంలో నెలకొన్న తీవ్ర ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి, రాజ్యాధికారంపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక శక్తులు ఫాసిజాన్ని ఆశ్రయించాయి. ప్రపంచవ్యాపంగా అనేక దేశాలలో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తి, కమ్యూనిస్టు ఉద్యమాలు ఉధృతంగా పెరుగుతూ వచ్చిన దశాబ్దాల కాలం అది. రష్యాలో 1917లో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం కావడం, సమాజంలో అన్ని రకాల దోపిడీలను నిర్మూలించడంలో గొప్ప ముందంజ వేయడం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజానీకానికి స్ఫూర్తినిచ్చింది. అధికారం కోల్పోయిన పాత పాలక వర్గాలు రెచ్చగొట్టిన అంతర్యుద్ధాన్ని, చుట్టుముట్టిన సామ్రాజవాద శక్తులను నవజాత రష్యన్ సోషలిస్టు సమాజం విజయవంతంగా ఎదుర్కొని అధిగమించిన తీరును ప్రత్యక్షంగా గమనించారు. ఈ పరిణామాలతో స్ఫూర్తి పొందిన జర్మనీ, హంగేరీ దేశాలలోని కార్మికవర్గం ఆయా దేశాల్లోని పాలక వర్గాలను అధికారం నుండి కూలదోయడానికి ప్రయత్నించింది. వివిధ కారణాల రీత్యా ఈ తిరుగుబాట్లు విఫలం అయ్యాయి. కానీ పాలక బూర్జువా వర్గం ఈ పరిణామాలతో అప్రమత్తం అయ్యింది. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మిక వర్గానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేజిక్కించుకోకుండా చూడడానికి పాలక శక్తులు రకరకాల ఫాసిస్టు ఎత్తుగడలను అవలంభించాయి. ఇటలీలో ముస్సోలిని, జర్మనీలో హిట్లర్, జపాన్‌లో



హిరోహితోలు ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహించారు. ఆయా దేశాల్లో ఫాసిజం తలెత్తడానికి దేశీయ బూర్జువా వర్గంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం కూడా ఎంతగానో తోడ్పడింది. ఫోర్ట్, రాక్‌ఫెల్లర్, కోకోకోలా వంటి బడా పారిశ్రామిక సంస్థలు ఫాసిజం అభివృద్ధి చెందడానికి బహిరంగంగానే తోడ్పాటునిచ్చాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే ఫాసిజం అంటే 'కార్మికవర్గ విప్లవాలకు బెదిరి ఫైనాన్స్ పెట్టుబడి బాహాటంగా ఉగ్రవాద నియంతృత్వానికి పాల్పడడం' అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక యోధుడు అయిన జార్జి డెమిట్రోవ్ నిర్వచించాడు. హిట్లర్ జర్మనీని పున: సైనికీకరించడం గురించి మొదట్లో పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం ఆందోళన పడలేదు. ఈ భూమ్మీద నుండి కమ్యూనిజాన్ని తుడిచిపెడతాను అన్న హిట్లర్ లక్ష్య ప్రకటనను విశ్వసించారు. వాళ్ళు కోరుకునేది కూడా అదే. నాడు బ్రిటన్ ప్రధానిగా ఉన్న విన్‌స్టన్ చర్చిల్ కమ్యూనిజం పట్ల తనకు ఉన్న తీవ్ర విద్వేషాన్ని ఎన్నడూ దాచిపెట్టుకోలేదు. కమ్యూనిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడని ఈ పెట్టుబడిదారీ దేశాలు గట్టిగా నమ్మాయి. ఈ గుడ్డి నమ్మకంతోనే హిట్లర్ యూరప్ దేశాల మీద యుద్ధానికి దిగినప్పుడు అతన్ని నిలవరించడానికి ప్రయత్నించలేదు. హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టడానికి 'ఫ్రంట్' కడదాం రమ్మని స్టాలిన్ ప్రతిపాదించినపుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు గట్టిగా తిరస్కరించాయి. హిట్లర్ తన సైన్యాన్ని ఫ్రాన్స్ మీదకు నడిపించి ఆ దేశాన్ని ఓడించి, బ్రిటన్‌ను బెదిరించిన తరువాత ఆ దేశాలు కళ్లు తెరిచాయి, హిట్లర్ ప్రమాదాన్ని గ్రహించాయి. అయినా 'ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం' అని స్టాలిన్ పదేపదే చేసిన ప్రతిపాదనలను నిర్లక్ష్యం చేశాయి. సోషలిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడన్న ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఆశలతోనే ఫాసిజంపై రెండవ దిక్కు నుంచి సాగించాల్సిన యుద్ధాన్ని అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు రెండేళ్లు ఆలస్యంగా మొదలుపెట్టాయి. ఇన్ని ఆటంకాల మధ్యన హిట్లర్ నాజీ సైన్యాన్ని ఎదుర్కొని, ఫాసిజాన్ని మట్టి కరిపించడంలో సోషలిస్టు రష్యా కీలక పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో 2 కోట్ల మంది రష్యన్లు అసువులు బాశారు. 30 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. దేశీయ పరిశ్రమలు, వ్యవసాయం ఘోరంగా దెబ్బతినిపోయాయి. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు తదితర మౌలిక వసతులు శిధిలాల గుట్టలుగా మారాయి. స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్, కురుస్క్ ప్రాంతాలలో జర్మన్ ఫాసిస్టు మూకలను ఎదుర్కొని తిప్పికొట్టడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. మాతృ దేశానికి చెందిన ప్రతి అంగుళం భూభాగాన్ని నిలబెట్టుకోవడానికి సోవియట్ సైన్యాలు భీకర పోరాటం సాగించాయి. రెడార్మీ సాధించిన ఈ విజయాలు చూశాక అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు హిట్లర్‌ను ఓడించవచ్చన్న నమ్మకం కలిగింది. హిట్లర్ సైన్యాన్ని సోవియట్ భూభాగం నుంచి నిర్ణయాత్మకంగా, విజయవంతంగా వెనక్కి తిప్పికొట్టడం మొదలవడం చూసి అప్పుడు పై మూడు దేశాలు జర్మనీ మీద రెండవ దిక్కు నుంచి దాడులు మొదలుపెట్టాయి. సోవియట్ రెడార్మీ కేవలం తమ భూభాగం నుంచి నాజీ సైన్యాన్ని తిప్పికొట్టడంతో సరిపెట్టుకోకుండా కమ్యూనిస్టు అంతర్జాతీయ స్ఫూర్తితో జర్మనీ రాజధాని బెర్లిన్ వైపుగా దూసుకుపోతూ అంతకు ముందు హిట్లర్ పాదాక్రాంతం చేసుకున్న యూరప్ దేశాల భూభాగాలను ఒకటొకటిగా విముక్తం చేశాయి. ఈ క్రమంలో ఫాసిస్టు ఆక్రమిత దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు వీరోచిత పాత్ర పోషించాయి. ఆయా దేశాల్లో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు పెంపొందించడానికి, గెరిల్లా దాడులు నిర్వహించడానికి కృషి చేశాయి. అత్యంత ధైర్య సాహసాలతో సాగిన ఈ కృషికి విస్తృతమైన మన్నన లభించింది. హిట్లర్ ఓటమి చవిచూశాక నాజీ సైన్యం ఆక్రమించుకున్న అనేక దేశాల్లోని ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను సోషలిస్టు పంథా వైపు నడిపించే కృషి చేపట్టాయి. ఈ క్రమంలోనే అనేక తూర్పు యూరప్ దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా అవతరించాయి. ఫ్రాన్స్, స్పెయిన్ వంటి పశ్చిమ యూరప్ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు గణనీయమైన రాజకీయ శక్తిగా ఎదిగాయి. కమ్యూనిజం ప్రాభవాన్ని, సోషలిజం విస్తరణలను దృష్టిలో ఉంచుకుని బూర్జువావర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా యూరప్ పున:నిర్మాణానికి ఒక 'మాస్టర్ ప్లాన్' రూపొందించింది. పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ కాలంలోనే అనేక సామాజిక సంక్షేమ పథకాల అమలుకు పూనుకున్నాయి. 'సంక్షేమ రాజ్యా'ల భావన ఉనికిలోకి వచ్చింది. ఫాసిజాన్ని నిర్ణయాత్మకంగా ఓడించడంలో సోవియట్ సోషలిస్టు రష్యా, రెడార్మీ నిర్వహించిన మహత్తర పాత్రను తుడిచిపెట్టేదానికి పెట్టుబడిదారీ వర్గాలు శతథా ప్రయత్నించి విఫలమయ్యాయి. చరిత్రను వక్రీకరించడానికి సాంస్కృతిక రంగాన్ని ఒక సాధనంగా వాడుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం మీద హాలీవుడ్ నిర్మించిన సినిమాలు ఇందుకు ఒక ఉదాహరణ. ఈ యుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు పోషించిన పాత్రను ఎక్కువ చేసి చూపిస్తూ, రెడార్మీ నిర్ణయాత్మక పాత్రను కావాలనే తక్కువ చేసి చూపడమో లేదా పూర్తిగా విస్మరించడమో చేశాయి.

# మితిమీరిన వీధి కుక్కల దాడులు



ఇటీవల వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశం నుంచే ఉంటుండటం ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వీధికుక్కల కాటు వల్ల ఏటా 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తుండటం, 30 నుంచి 60 శాతం మృతుల్లో అభం శుభం తెలియని చిన్నారులు ఎక్కువగా ఉంటుండటం మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను తీవ్రంగా కలిచివేసే విషయం. అదేవిధంగా యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్–2001 ప్రకారం ఈ వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీటికి టీకాలు వేయడంలో విఫలం అవుతుండటం ప్రజల పాలిట శాపంగా మారి, ఈ వీధి కుక్కల దాడులు వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలకు ఏ మాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ వీధి కుక్కల కాటు నుంచి దేశ ప్రజానీకానికి విముక్తి కలిగించాలంటే తక్షణమే మన కేంద్ర ప్రభుత్వం వారు యుద్ధ ప్రాతిపదికన కదలాలి. సంబంధిత శాఖ వారికి ఈ వీధి కుక్కల దాడులను అరికట్టే చర్యలకు పూనుకునేలా సిఫారసు చేయాలి. లేకపోతే ప్రతి ఏడాది వేలాది మంది విలువైన ప్రాణాలు ఈ వీధికుక్కల కాటు వల్ల అనంత వాయువుల్లో కలిసిపోతాయి. వీధి కుక్కల దాడుల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

# మధ్యతరగతి ఎందుకు కొనలేకపోతున్నది?

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు–తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించకపోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి.

# విశాఖ భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు

ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో విశాఖలో అత్యంత విలువైన భూములను అతి తక్కువ ధరలకే కట్టబెట్టే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిగమ్నమైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విశాఖలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను చడీచప్పుడు కాకుండా కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ (టిసిఎస్)కి హిల్ నెంబర్ 3లో 21 ఎకరాల భూములను కేటాయించారు. ఉర్సా కంపెనీకి దాని పక్కన, కాపులుప్పాడలోనూ భూమిని కేటాయించారు. టిసిఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడులతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. ప్రతిష్టాత్మక టిసిఎస్ ఇట్లాంటి ఒప్పందానికి ఎలా అంగీకరించింది? ఇది ప్రభుత్వం అత్యుత్సాహమా? వాస్తవం ఏంటనేది ప్రజలకు తెలియజేయాలి. ఆ పక్కనే ఉర్సా కంపెనీకి భూములు కేటాయించడం పట్ల కూడా ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఈ కంపెనీని 2025 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. దీనికి కార్పొరేట్ గుర్తింపు (రిజిస్ట్రేషన్ నెంబర్ 193897) ఇచ్చారు. రూ.10 లక్షల పెట్టుబడితో ఏర్పడిన కంపెనీ ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోను వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకున్నారు? ఈ కంపెనీకి ఇద్దరు మాత్రమే డైరెక్టర్లుగా వున్నారు. ఐటి రంగంలో కనీసం గుర్తింపు లేని కంపెనీ. ఇలాంటి కంపెనీకి టిసిఎస్ పక్కనే కేటాయిస్తే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందనే కుట్ర దాగి వుందా? లేదా ఏ లాభాపేక్షతో ఉర్సాకు భూములు కేటాయించారు? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అనుకూలురు వుంటే కోట్లాది విలువ చేసే భూములను పొందవచ్చనేది ఉర్సా ఉదంతం తెలియజేస్తున్నది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములపై అనేక అనుమానాలను విశాఖ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలకు చెప్పాల్సి వుంది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూమి అత్యంత విలువైన భూమి. ఈ కంపెనీలతో జరిగిన ఒప్పందాలు అత్యంత రహస్యంగా వుంచాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? మొదట ఎకరా 99 పైసలకే కేటాయించారని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఎకరా 99 పైసలకు కాదని బదులిచ్చింది. ఒక కంపెనీతో ఎం.ఒ.యు కుదుర్చుకున్నప్పుడు ఆ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తుందా? లేదా? అనే విశ్వాసనీయమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా భూములు కేటాయించినట్లు అర్థమౌతుంది. ఉర్సా క్లస్టర్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటయిన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.5196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేసి 2500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తురదని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద 60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇంత అడ్డగోలుగా భూములు కేటాయించి దానిని సమర్ధించుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనది. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250




ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. ఎ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హోదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా కూటమి నాయకులు ప్రభు భక్తి చాటుకుంటున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విశాఖలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు అత్యంత విలువైనవి. ఈ ప్రాంతం పచ్చని కొండలతో నిండి వుంటుంది. ఇప్పుడు వాటిని ధ్వంసం చేస్తున్నారు. విశాఖ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలి. వికసిత ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణం చాలా కీలకమైనది విజన్ 2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రటించింది. ఈ దృష్ట్యా ఉర్సాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి. లేదంటే ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తోంది.